AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatodaynews.com


## బిగాల గణేష్ గుప్తాను పరామర్శించిన జీవన్‌రెడ్డి



**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్** : నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాలను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఇటీవల కారు ప్రమాదానికి గురైన బిగాల తృటిలో తప్పించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన యోగక్షేమాలను తెలుసుకున్న జీవన్‌రెడ్డి ప్రమాదం నుంచి క్షేమంగా బయటపడడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఆయన వెంట నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్ నాయకులు తదితరులున్నారు.


9-6-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2


## ఎరువుల కొరత లేదు.. రైతులు ఆందోళన చెందవద్దు: కలెక్టర్



**అక్షరటుడే, ఇందూరు:** జిల్లాలోని అన్ని సహకార సంఘాల గోడౌన్లు, సేల్ పాయింట్లలో రైతులకు సరిపడా ఎరువుల నిల్వలు ఉన్నాయని.. ఆందోళన చెందవద్దని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు.. ఎడపల్లి మండలంలోని జానకంపేట్, ఎడపల్లిలో ఎరువుల గిడ్డంగులు, విక్రయ కేంద్రాలను కలెక్టర్ మంగళవారం తనిఖీ చేశారు. గోడౌన్లలో నిల్వ ఉన్న యూరియా, ఇతర ఎరువులను పరిశీలించారు. స్టాక్, రిజిస్టర్‌లో పొందుపర్చిన వివరాలతో సరిపోల్చుకున్నారు. ఇప్పటివరకు ఎన్ని ఎరువుల బస్తాలు వచ్చాయి.. ఎన్ని పంపిణీ చేశారు.. ఎంత పంపిణీ చేయాల్సి ఉందనే వివరాలను అధికారులతో అడిగి తెలుసుకున్నారు. యూరియా బుకింగ్ యాప్ పనితీరును స్వయంగా పరిశీలన జరిపి, యాప్ వల్ల సమకూరే ప్రయోజనాల గురించి రైతులకు వివరించారు. మన రాష్ట్రంలో అమలు అవుతున్న బుకింగ్ యాప్ విధానాన్ని ఇతర రాష్ట్రాలు కూడా ఎరువుల పంపిణీ కోసం అమలు చేస్తున్నాయన్నారు. ఈ యాప్ వల్ల ఎలాంటి నష్టం లేదని, గత రబీ సీజన్‌లో కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా అమలు చేయడం జరిగిందని గుర్తు చేశారు. ఎరువులు పక్కదారి పట్టకుండా, పారదర్శకంగా, ప్రణాళికాబద్ధంగా యూరియా పంపిణీకి బుకింగ్ యాప్ దోహదపడుతుందని, దీని విషయంలో రైతులు అపోహలకు గురికావద్దని కలెక్టర్ సూచించారు. నానో యూరియా వాడకం వల్ల కలిగే లాభాలపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రయోగాత్మకంగా కొంత పరిమాణంలో నానో యూరియాను వినియోగించి ఫలితాలను స్వయంగా పరిశీలించాలని రైతులకు హితవు పలికారు. అయితే రైతులను నానో యూరియా కొనాలని బలవంతం చేయవద్దని, వారు కోరిన ఎరువులు మాత్రమే అందించాలన్నారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి, జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాస్, తహశీల్దార్ దత్తాద్రి, జానకంపేట్ సర్పంచ్ అనురాధ, సొసైటీ ఛైర్మన్ నరేందర్, స్థానిక అధికారులు పాల్గొన్నారు.



## దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

**అక్షరటుడే, ఆర్మూర్ :** దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని ఆర్మూర్ మండల పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్ జాన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఢిల్లీలోని జాతీయ విచారణ కమిషన్ ఛైర్మన్ జస్టిస్ కేజీ బాలకృష్ణన్‌ను బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధుల బృందం మంగళవారం ఇటీవల కలిసింది. ఈ సందర్భంగా ఆయనకు రాజ్యసభ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, పార్టీ జనరల్ సెక్రెటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ కార్పొరేషన్ ఛైర్మన్ రాజీవ్‌సాగర్ తదితరులు వినతిపత్రం అందజేశారు. ఈ బృందంలో రమేష్ జాన్ సైతం పాల్గొని చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జస్టిస్ బాలకృష్ణన్‌కు బీఆర్ఎస్ పార్టీ క్రైస్తవ సంక్షేమం కోసం నివేదిక ఇవ్వడం సీఎం కేసీఆర్ నిబద్ధతకు నిదర్శనం అన్నారు. ఇదే విషయమై ఇతర రాజకీయ పార్టీల మౌనం వహించడంపై ధ్వజమెత్తారు. క్రిస్టియన్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మాణిక్యాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత క్రైస్తవుల సంక్షేమం కోసం పాటుపడిన ఘనత బీఆర్ఎస్ పార్టీకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో క్రైస్తవ నాయకులు బిషప్ విద్యాసాగర్, మోజెస్, సొలోమోన్, బిషప్ దుర్గం ప్రభాకర్ పాల్గొన్నారు.

# కామారెడ్డికి మళ్లీ వరదలొస్తే..!?

ప్రకృతి కోపానికి గతేడాది కామారెడ్డి కకావికలమైంది. గతంలో లేని విధంగా పట్టణాన్ని మొత్తం వరదలు చుట్టుముట్టాయి. రెండు కాలనీలు మొత్తం జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. అధికార యంత్రాగం అంతా సహాయక చర్యల్లో నిమగ్నమైంది. భారీ ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నా.. వరదల బీభత్సం ఆనవాళ్లు ఇంకా భయపెడుతూనే ఉన్నాయి. వాటిని చూస్తూ ప్రజలు నాటి చేదు జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటున్నారు.

**- అక్షరటుడే, కామారెడ్డి**



- గతేడాది అతలాకుతలం చేసిన వరదలు
- ఆదుకుంటామని స్వయంగా వచ్చి హామీ ఇచ్చిన సీఎం
- పది నెలలైనా అమలుకు నోచుకోలేని హామీ
- కాగితాలకే పరిమితమైన ప్రతిపాదనలు
- వర్షా కాలం రావడంతో భయంభయంగా ప్రజలు

కామారెడ్డి పట్టణంలో గతేడాది ఆగస్టు 26న కురిసిన భారీ వర్షాలకు జన జీవనం అతలాకుతలమైంది. జీఆర్ కాలనీ, కౌండిన్య కాలనీ, బతుకమ్మ కుంట ప్రాంతాలు పూర్తిగా నీట మునిగాయి. రోడ్లు కోతకు గురయ్యాయి. ఆ రాత్రంతా కాలనీ వాసులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడిపారు. పంట పొలాలు ఇసుక మేటలు వేసి నిరుపయోగంగా మారాయి.

### పర్యటనలు, భరోసాలు

వరదల అనంతరం ఆగస్టు 28న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క కామారెడ్డిలో పర్యటించి బాధిత కాలనీలను పరిశీలించారు. కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించి నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆగస్టు 31న నలుగురు ఎమ్మెల్సీల బృందం వరద ప్రాంతాల్లో పర్యటించి నష్టం వివరాలను ప్రభుత్వానికి నివేదించింది. సెప్టెంబర్ 3న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా కామారెడ్డి పట్టణంలో పర్యటించారు. జీఆర్ కాలనీ, కౌండిన్య కాలనీల్లో బాధితులను పరామర్శించి ఖచ్చితంగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

### 15 రోజుల మాట.. నీటి మూట

పర్యటన అనంతరం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశమైన సీఎం 15 రోజుల్లో నివేదిక తెప్పించుకుని శాశ్వత పనులకు నిధులు మంజూరు చేస్తామని ప్రకటించారు. 10 నెలలు దాటిపోయింది కానీ ఇచ్చిన హామీ మాత్రం కార్యరూపం దాల్చలేదు. శాశ్వత పరిష్కారం కోసం అధికారులు రూ.250 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. అక్టోబర్ 8న కేంద్ర బృందం సైతం వచ్చి పరిశీలించి వెళ్లింది. ఇప్పటివరకు వరద సాయం మాత్రం అందలేదు. తాత్కాలిక పనుల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం రూ. 20 కోట్లు మంజూరు చేసి చేతులు దులుపుకుందన్న ఆరోపణలు వస్తున్నాయి. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ ఇటీవల బ్రిడ్జి నిర్మాణానికి రూ.4 కోట్ల నిధులు మంజూరు చేయించుకోగలిగారు. కానీ కామారెడ్డి పట్టణానికి మాత్రం మొండిచెయ్యి చూపారు.

**15 రోజుల మాట.. నీటి మూట**

పర్యటన అనంతరం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశమైన సీఎం 15 రోజుల్లో నివేదిక తెప్పించుకుని శాశ్వత పనులకు నిధులు మంజూరు చేస్తామని ప్రకటించారు. ఆ 15 రోజుల గడువు కాస్తా పది నెలలు దాటిపోయింది. కానీ ఇచ్చిన హామీ మాత్రం కార్యరూపం దాల్చలేదు. శాశ్వత పరిష్కారం కోసం అధికారులు రూ.250 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. అక్టోబర్ 8న కేంద్ర బృందం సైతం వచ్చి పరిశీలించి వెళ్లింది.

### పట్టించుకోని ప్రజాప్రతినిధులు

ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదని పట్టణవాసులు మండిపడుతున్నారు. మళ్లీ వర్షాకాలం మొదలుకావడంతో జీఆర్ కాలనీ, కౌండిన్య కాలనీ వాసులు భయంభయంగా కాలం వెళ్లదీస్తున్నారు. శాశ్వత డ్రెయినేజీ వ్యవస్థ, రక్షణ గోడలు లేకపోతే ఈసారి పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కామారెడ్డిలో భూ కబ్జాలు, నాలాల కబ్జాలతోనే వరదలు ముంచెత్తాయని ప్రచారం సాగుతోంది. ఇప్పటికి కబ్జాలపై అధికారులు చర్యలు తీసుకోలేదు. ఈ నెల 18 న కామారెడ్డికి సీఎం రేవంత్ రెడ్డి రానున్నట్టుగా ప్రచారం సాగుతోంది. అదే నిజమైతే ఆ లోపు ప్రభుత్వం వరద సాయం ప్రకటించేలా ఇక్కడి నాయకులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



## రాష్ట్రంలో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే..

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** రాష్ట్రంలో ప్రతిగుండెలో మాజీ సీఎం కేసీఆర్ ఉన్నాడని, వచ్చేది కచ్చితంగా బీఆర్ఎస్ ప్రభుత్వమేనని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, బిగాల గణేష్ గుప్తా, జీవన్ రెడ్డి, హనుమంత్ షిండే, జాజాల సురేందర్, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ.. పెద్దసంఖ్యలో కార్యక్రమానికి కార్యకర్తలు రావడం చూస్తే.. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినట్టే ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర కోసం అలుపెరుగని పోరాటం చేసిన వ్యక్తి కేసీఆర్ అని, తెలంగాణను బంగారు తెలంగాణగా మార్చాడన్నారు. వరిధాన్యం కొనుగోలు చేయడానికి నెలల పాటు రోడ్లపై వడ్ల బస్తాలు పెట్టుకొని రైతులకు ఇబ్బంది పెట్టిన పార్టీ కాంగ్రెస్ అని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. కేసీఆర్ రాష్ట్రంలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశాడన్నారు. కాళేశ్వరం రెండు పిల్లర్లు కూలిపోతే దాని రిపైర్ చేయించకుండా రచ్చ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత అని వ్యాఖ్యానించారు.



## 'యూరియా యాప్' తొలగించాలని రైతుల రాస్తారోకో

**అక్షరటుడే, ఆర్మూర్:** యూరియా బుకింగ్ యాప్‌ను తక్షణమే తొలగించాలని రైతులు డిమాండ్ చేశారు. ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామ రైతులు మంగళవారం 63వ నెంబర్ జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. రైతులు మాట్లాడుతూ.. యూరియా యాప్ తో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రస్తుతం మొక్కజొన్నకు యూరియా చల్లే సమయం ఆసన్నమైందని తాము పొలంలో పని చేసుకోవాలా లేక యూరియా కోసం లైన్ కట్టాలా అనే అయోమయ స్థితిలో ఉన్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యూరియా యాప్‌ను తక్షణమే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. రైతులకు వారి అవసరాలకు అనుగుణంగా యూరియాను అందించాలని కోరారు. రాస్తారోకో కారణంగా కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాడంతో ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ ఘటనాస్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడి సముదాయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దేవేందర్ రెడ్డి, రైతు నాయకులు నవీన్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



## ఇంటర్‌లింక్ వ్యవస్థతో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా: ట్రాన్స్‌కో ఎస్ఈ



**అక్షరటుడే, ఇందూరు:** వినియోగదారులకు ఎలాంటి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు ఇంటర్‌లింక్ విధానాన్ని అమలు చేస్తున్నామని ట్రాన్స్‌కో ఎస్ఈ పీవీ రాజేశ్వర్‌రావు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. ఏదైనా ఒక సబ్‌స్టేషన్ లో, ప్రధాన లైన్‌లలో ప్రకృతి వైపరీత్యాలు, గాలివానలు, వరదలు, అత్యవసర మరమ్మతులు కారణంగా సరఫరా నిలిచిపోయే అవకాశం ఉంటుందన్నారు. ఆ సమయంలో వినియోగదారులకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు ఆధునిక ఇంటర్ లింక్‌లైన్ (అనుసంధాన) వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. సాధారణంగా ఒక విద్యుత్ లైన్‌లలో లోపం ఏర్పడితే ఆ పరిధిలోని వినియోగదారులకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. అయితే ఇంటర్‌లింక్ లైన్ వ్యవస్థ ద్వారా ఒక 33/11 కేవీ సబ్‌స్టేషన్ నుంచి మరో 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు అనుసంధానం చేస్తారన్నారు. అలాగే ఒక 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు సమీపంలోని 132/33 కేవీ సబ్‌స్టేషన్‌కు, అలాగే ఒక 33 కేవీ లైన్‌ను మరో 33 కేవీ లైన్‌కు అనుసంధానం చేస్తారన్నారు. దీంతో ఒక మార్గంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయిన సందర్భంలో వెంటనే ప్రత్యామ్నాయ మార్గం ద్వారా విద్యుత్ సరఫరా జరుగుతుందని వివరించారు. దీంతో వినియోగదారులకు విద్యుత్ అంతరాయాలు గణనీయంగా తగ్గడమే కాకుండా, అత్యవసర పరిస్థితుల్లో కూడా నిరంతరాయ విద్యుత్ సరఫరా కొనసాగుతుందని చెప్పారు.

## జిల్లా కాంగ్రెస్ కార్యాలయ భవనం కోసం భూమి కేటాయింపు



**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీకి సొంత కార్యాలయ భవన నిర్మాణానికి మార్గం సుగమమైందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఏలె మల్లికార్జున్ పేర్కొన్నారు. భవనం నిర్మాణం కోసం ప్రభుత్వం ఎకరం భూమిని కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 140 ఏళ్ల చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీకి కామారెడ్డి జిల్లాలో ఇప్పటివరకు శాశ్వత కార్యాలయ భవనం లేదని, ఈ విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌లతో పలుమార్లు చర్చించడం జరిగిందన్నారు. పార్టీకి సొంత కార్యాలయం అవసరాన్ని వివరించడంతో ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం పరిసర ప్రాంతంలోని అడ్లూర్ శివారులో సర్వే నంబర్ 527/42/1/2లో ఒక ఎకరం ప్రభుత్వ భూమిని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయ భవన నిర్మాణం కోసం కేటాయించారని వివరించారు. భూమి కేటాయింపుతో జిల్లా కాంగ్రెస్ కార్యకలాపాలకు శాశ్వత చిరునామా లభించనుందన్నారు. కార్యకర్తల సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారానికి స్థిర వేదిక అందుబాటులోకి రానుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, జిల్లా అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, కార్యకర్తలకు శాశ్వత వేదిక కల్పించాలనే లక్ష్యంతో చేసిన ప్రయత్నాలు ఫలించాయని, జిల్లా కాంగ్రెస్ కార్యాలయ నిర్మాణాన్ని త్వరలోనే ప్రారంభించి ఆదర్శవంతమైన పార్టీ భవనంగా తీర్చిదిద్దుతామని ఆయన పేర్కొన్నారు.

**మరో వారంరోజుల్లో పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. ప్రైవేట్ పాఠశాలలు ఇప్పటికే అడ్మిషన్ల కోసం తమ ప్రచారాన్ని జోరుగా సాగిస్తున్నాయి. అయితే వీటికి దీటుగా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు సైతం ఏమాత్రం తగ్గకుండా ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వివరిస్తూ తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని సూచిస్తున్నారు. – అక్షరటుడే గాంధారి**




# అడ్మిషన్ల కోసం వేట..

- జోరుగా ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్ల ప్రచారం
- ఇంటింటికీ తిరుగుతూ అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు
- ఆఫర్లు ప్రకటిస్తూ ఆకర్షిస్తున్న ప్రైవేట్ స్కూళ్లు

ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు ముఖ్యంగా మధ్య తరగతిని టార్గెట్ చేస్తూ అడ్మిషన్ల కోసం ఇంటింటికీ తిరుగుతున్నాయి. పిల్లలకు నాణ్యమైన విద్యను తక్కువ ఫీజుతోనే అందజేస్తామని.. మార్కులు ఎక్కువ వస్తే ఫీజులో డిస్కౌంట్లు ఇస్తామని పేర్కొంటున్నాయి. ఇదివరకు ఆ పాఠశాలలో చదివిన విద్యార్థులు నవోదయ, అగ్నివీర్ వంటి వాటిలో సెలెక్ట్ అయిన విద్యార్థుల ఫొటోలతో కరపత్రాలు ప్రచురించి పంచుతున్నాయి. అయితే పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్ స్కూళ్లలో ఏ స్కూల్‌లో తమ పిల్లలను చేర్పించాలో తెలియక విద్యార్థుల తల్లిదండ్రులు తలలు పట్టుకుంటున్నారు.

### తల్లిదండ్రులకు ఆర్థిక భారం..

స్కూల్ ప్రారంభమవుతుందంటే చాలు.. విద్యార్థుల తల్లిదండ్రుల్లో భయం మొదలవుతుంది. ముఖ్యంగా తమ పాఠశాలల్లోనే యూనిఫాం, ఇతర సామాగ్రి తీసుకోవాలని.. పుస్తకాలు సైతం తాము చెప్పిన చోటే కొనుగోలు చేయాలనే నిబంధనలు పెడుతుండడంతో తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. తల్లిదండ్రులు తమకు నచ్చిన చోట పుస్తకాలు, డ్రెస్సులు కొనే స్వేచ్ఛ లేకుండా పోయింది. అలాగే బస్సు ఛార్జీల పేరుతో అడ్డగోలుగా వసూలు చేస్తున్నారని.. దీనికి అంతే లేకుండా పోతోందని వారంటున్నారు. తమ నెలవారీ జీతాలతో ఈ వస్తువులు కొనులేని మధ్యతరగతి ప్రజలు ప్రత్యేకంగా అప్పులు చేయాల్సి వస్తోందని వారు పేర్కొంటున్నారు.

### ప్రైవేట్‌కు దీటుగా ప్రచార జోరు..

ప్రైవేట్ విద్యా సంస్థల జోరుకు ప్రభుత్వ పాఠశాలలు సైతం గట్టిగానే సమాధానం చెప్తున్నాయి. నాణ్యమైన విద్యకు కేరాఫ్ అడ్రస్ ప్రభుత్వ పాఠశాలలేనని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చదవించవచ్చని.. అన్ని సౌకర్యాలు ఉంటాయని పేర్కొంటున్నారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్న భోజనంతో సహా సాయంత్రం సైతం స్నాక్స్ అందిస్తున్నామని.. మీ పిల్లల బాధ్యత మాదేనని ప్రభుత్వ ఉపాధ్యాయులు భరోసా ఇస్తున్నారు. ఉచిత పుస్తకాలు, నోటుబుక్కులు, నాణ్యమైన మధ్యాహ్న భోజనం, కంప్యూటర్ ల్యాబ్, విహారయాత్రల ప్రోగ్రాం వంటి అనేక వినూత్న కార్యక్రమాలను ప్రభుత్వ పాఠశాలల్లో ఉంటాయని వివరిస్తున్నారు.



## కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

**అక్షరటుడే, ముప్కాల్:** మండలంలోని నాగంపేట్ గ్రామంలో మంగళవారం కల్యాణ లక్ష్మి పథకం కింద లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. సర్పంచ్ దాసరి గంగాధర్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాంధేని లిఖిత, వడ్డేపల్లి అమూల్య, చందూరి సుప్రియలకు చెక్కులు ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ వసంత్‌రావు, ఆర్ఐ రవి, జీపీవో చందు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



## ఆవు, దూడలపై దాడి

**అక్షరటుడే, గాంధారి:** మూగజీవులపై గుర్తుతెలియని వ్యక్తులు కర్కశత్వం చూపారు. వాటిని గాయాలు చేశారు. ఈ ఘటన గాంధారి మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గాంధారి మండలంలో సోమవారం తండాకు చెందిన రైతు విలాస్ తన రెండు ఆవులు, రెండు దూడలను అడవికి మేతకు పంపాడు. అయితే అడవిలో గుర్తు తెలియని వ్యక్తులు ఆవు, దూడల కాళ్లకు కత్తులతో గాట్లు పెట్టారు. వాటిని ఇష్టానుసారంగా కొట్టడంతో మూగజీవాలు కుంటుతూ ఇంటికి వచ్చాయి. దీంతో విలాస్ ఆయన కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. సొంత బిడ్డల్లా పెంచుకుంటున్న మూగజీవాలపై దుండగులు దాడికి దిగడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటిపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



## కామారెడ్డి రైల్వేస్టేషన్‌లో గంజాయి పట్టివేత.. ఇద్దరు యువకుల అరెస్ట్

**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి రైల్వేమార్గం అక్రమార్కులకు వరంగా మారుతోంది. ఇక్కడి యువతను మత్తుకు బానిస చేసేలా నిషేధిత మత్తు పదార్థాలు, గంజాయి సరఫరా చేస్తున్నారు. తాజాగా కామారెడ్డి రైల్వే స్టేషన్‌లో మంగళవారం 10 కిలోల ఎండు గంజాయిని ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. కుంబలఘర్ నుంచి పూణే వెళ్తున్న నాగవల్లి ఎక్స్ ప్రెస్‌లో అధికారులు తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో ఇద్దరు వ్యక్తుల వద్ద 10 కిలోల ఎండు గంజాయి లభించింది. పట్టుబడిన ఇద్దరు మహారాష్ట్రలోని జాల్నా జిల్లాకు చెందిన సునీల్, ప్రవీణ్‌గా అధికారులు గుర్తించారు. నిందితులిద్దరు ఒడిస్సాలోని రాయ్ ఘడ్‌లో ఎండు గంజాయిని కొనుగోలు చేసి మహారాష్ట్రలోని రాయ్‌పూర్‌కు చేరవేస్తున్నట్టు ఎక్సైజ్ సీఐ సంపత్ కృష్ణ వెల్లడించారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ. 5 లక్షలు ఉంటుందని, నిందితులిద్దరిని రిమాండ్‌కు తరలించామని తెలిపారు. దాడుల్లో ఎస్సై విక్రమ్ కుమార్, కుమార్, హెడ్ కానిస్టేబుళ్లు జాన్ బల్వంత్‌రావు, ఫరీద్, సిబ్బంది రాజు, పవన్ రెడ్డి, బాబు, శరత్, వందన పాల్గొన్నారు.

## జల్సాల కోసం అడ్డదారి తొక్కిన మైనర్లు.. ఆన్‌లైన్ షాపింగ్ మోజులో చోరీలు

**అక్షరటుడే, కామారెడ్డి:** చూడడానికి వారిద్దరు మైనర్లే.. కానీ వారు చేసే పనులు మాత్రం ప్రొఫెషనల్ దొంగలను మించిన చోరీలు. ఆన్‌లైన్‌లో షాపింగ్ చేయడానికి, జల్సాలకు అలవాటు పడ్డ ఇద్దరు మైనర్లు ఓ ఇంట్లో చోరీకి పాల్పడి ఉడాయిస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా గ్రామస్తులకు చిక్కారు. తాడ్వాయి మండలం దేవాయిపల్లి గ్రామంలో ఇద్దరు మైనర్లు చోరీ కథ నాటకీయంగా ముగిసింది. ఆన్‌లైన్ షాపింగ్ పిచ్చిలో పడిన ఆ ఇద్దరూ అడ్డదారి తొక్కారు. పోలీసుల కథనం ప్రకారం.. ఓ మహిళ రాత్రి వేళ ఇంటికి తాళం వేసి ఆరుబయట పడుకుంది. ఇదే అదనుగా భావించిన ఇద్దరు మైనర్లు, ఆమె దిండు కింద ఉన్న తాళం చెవిని మెల్లగా తస్కరించారు. నేరుగా ఇంట్లోకి వెళ్లి ఇనుప పెట్టె ఎత్తుకొచ్చారు. పని పూర్తయ్యాక దొరక్కూడదని తాళాన్ని యథాస్థానంలో పెడుతుండగా కథ అడ్డం తిరిగింది. తాళం దిండు కింద పెడుతున్న సమయంలో మహిళకు చేయి తగలడంతో ఉలిక్కిపడి లేచింది. దాంతో ఇద్దరు అడ్డంగా దొరికిపోయారు. స్థానికుల సమాచారంతో పోలీసులు రంగంలోకి దిగి ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణలో విస్తుపోయే నిజాలు వెలుగుచూశాయి. ఆన్‌లైన్ షాపింగ్‌కు బానిసలై ఖరీదైన వస్తువుల కోసం చోరీలకు అలవాటు పడ్డామని మైనర్లు అంగీకరించారు. చోరీ చేసిన డబ్బుతో విచ్చలవిడిగా జల్సాలు చేస్తున్నట్లు తేలింది. పోలీసులు మైనర్ల నుంచి రూ.15 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. మైనర్లు కావడంతో కేసు నమోదు చేసి జువైనల్ కోర్టులో హాజరుపరిచారు. పిల్లలపై తల్లిదండ్రులు నిఘా పెట్టాలని, ఆన్‌లైన్ మోజులో పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

## మున్సిపల్ సామగ్రి అక్రమంగా తరలించిన వారిపై చర్యలు తీసుకోవాలి



**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి మున్సిపాలిటీకి సంబంధించిన సామగ్రిని అక్రమంగా తరలించిన వారిపై చర్యలు తీసుకోవాలని 20వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ కల్లెం సావిత్రి కోరారు. ఈ మేరకు ఆమె ఆధ్వర్యంలో కౌన్సిలర్లు మంగళవారం మున్సిపల్ కమిషనర్ పర్వతాలుకు ఫిర్యాదు చేశారు. 2024 డిసెంబర్ 10న రాత్రి సమయంలో కూలీల సహాయంతో మున్సిపల్ వాటర్ వర్క్స్ ఫిల్టర్ బెడ్ వద్ద నిల్వ ఉంచిన సామగ్రిని ఎటువంటి అనుమతి లేకుండా దొంగతనంగా తరలించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే బుర్ర మత్తడి, పెద్ద చెరువు ప్రాంతం, వాటర్ బెడ్ ట్యాంక్ సమీపం నుంచి, జాతీయ రహదారి పక్కన ఉన్న ప్రదేశాలు నుంచి కూడా సామగ్రి తరలించినట్టుగా అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయమై గత 2024 డిసెంబర్ 15 న పోలీస్ స్టేషన్, 16న మున్సిపల్ కమిషనర్, 21న కలెక్టర్‌కు ఫిర్యాదు కూడా చేయడం జరిగిందని, ఇప్పటి వరకు స్క్రాప్, పాత మోటార్లు, ఇతర విలువైన వస్తువులను అక్రమంగా తరలించి విక్రయించిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. వెంటనే ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## పొల్యూషన్ చెకింగ్ సెంటర్ల తనిఖీ..

అక్షర టుడే కథనానికి స్పందన




**అక్షరటుడే, ఆర్మూర్:** పొల్యూషన్ సెంటర్లలో నిబంధనలకు విరుద్ధంగా అధికంగా డబ్బులు వసూలు చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఆర్మూర్ ఎంవీఐ రాహుల్ కుమార్ హెచ్చరించారు. 'అక్షరటుడే' పత్రికలో సోమవారం 'పొల్యూషన్ సెంటర్లలో దోపిడీ' శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఆర్మూర్ ఎంవీఐ పరిధిలోని పొల్యూషన్ సెంటర్లను మంగళవారం ఏఎంవీఐ జి.రోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. పొల్యూషన్ సెంటర్‌లోని పరికరాలను పరిశీలించారు. నిబంధనల ప్రకారం పొల్యూషన్ పరీక్షలు నిర్వహించాలని.. తర్వాత పొల్యూషన్ సర్టిఫికెట్ అందించాలని ఆదేశించారు. నిబంధనల ప్రకారం డబ్బులు తీసుకోవాలని సూచించారు. నిబంధనకు విరుద్ధంగా వ్యవహరిస్తే లైసెన్సులు రద్దుచేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## నగరంలో దొంగల హల్‌చల్.. లాకర్‌తో పరారీ



**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** నగరంలో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. వరుస చోరీలకు పాల్పడుతూ నగరవాసులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. పక్షం రోజుల కిందట వినాయక్‌నగర్‌లో నాలుగైదు ఇళ్లల్లో చోరీలకు పాల్పడ్డ దుండగులు.. తాజాగా సుభాష్‌నగర్‌లో భారీ చోరీకి పాల్పడ్డారు. నగరంలోని మూడో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుభాష్ నగర్‌లో సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత దుండగులు తాళం వేసిన ఇంట్లో చొరబడ్డారు. ఆ ఇంటి యజమాని ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో ఉంటున్నాడు. ముందుగా రెక్కీ వేసిన దొంగలు పక్కా ప్రణాళికతో ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. లాకర్‌ను తెరిచేందుకు తీవ్రంగా ప్రయత్నం చేయగా అది తెరుచుకోకపోవడంతో ఏకంగా లాకర్‌ను ఎత్తుకెళ్లారు. అందులో భారీఎత్తున బంగారు నగలు ఉన్నట్లుగా తెలుస్తోంది. ఉదయం ఇంటి తలుపులు తెరిచి ఉండడం.. ఇళ్లంతా చిందరవందరగా ఉన్నట్లుగా గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇంట్లో ఉన్న లాకర్‌ను ఎత్తుకెళ్లడాన్ని బట్టి అంతర్రాష్ట్ర ముఠా చోరీ చేసి ఉండవచ్చని ప్రాథమికంగా అంచనాకు వచ్చారు.

## ట్రాక్టర్ కల్టివేటర్ తగిలి చిన్నారి మృతి

**అక్షరటుడే, కోటగిరి :** ట్రాక్టర్ కల్టివేటర్ తగిలి చిన్నారి మృతి చెందింది. ఈ ఘటన కోటగిరి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. కోటగిరి మండల కేంద్రానికి చెందిన పాల గంగారాం తన ట్రాక్టర్‌కు కల్టివేటర్ తగిలించడానికి వెనుకకు తీస్తుండగా, అక్కడే ఆడుకుంటున్న అతడి మనమరాలు మహన్విక (2) తలకు ట్రాక్టర్ బంపర్ తగిలి పడిపోయింది. వెంటనే చిన్నారిని కుటుంబీకులు బోధన్ ప్రభుత్వాస్పత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లగా అప్పటికే చిన్నారి మృతి చెందిందని వైద్యులు పేర్కొన్నారు. మృతురాలి తండ్రి విశ్వనాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## గుండెపోటుతో మరో కానిస్టేబుల్ మృతి..

### పోలీస్‌శాఖలో కలవరపెడుతున్న వరుస ఘటనలు



**అక్షరటుడే, గాంధారి:** పోలీస్‌శాఖలో వరుస గుండెపోటు ఘటనలు కలవరపెడుతున్నాయి. నిజామాబాద్ జిల్లాలో సోమవారం విధుల్లో ఉండగానే ఓ హెడ్ కానిస్టేబుల్ గుండెపోటుతో మృతి చెందగా.. మంగళవారం గాంధారి మండలంలో మరో కానిస్టేబుల్ హార్ట్ ఎటాక్‌తో మరణించాడు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో గత రెండేళ్లుగా విధులు నిర్వహిస్తున్న రఘు (44) సోమవారం నైట్ డ్యూటీ నిర్వహించాడు. అనంతరం మంగళవారం ఉదయం రిలీవ్ అయి స్వగ్రామమైన బాన్సు వాడలో ఇంటికి చేరుకున్నాడు. కాల కృత్యాలు తీర్చుకున్న అనంతరం చాతిలో నొప్పి వస్తుందని కుటుంబీకులకు తెలపడంతో వారు వెంటనే ఆస్పత్రికి తరలించారు. కానీ అప్పటికే ఆయన మృతి చెందినట్లుగా వైద్యులు పేర్కొన్నారు. రఘుకు భార్య ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని తోటి సిబ్బంది తెలిపారు. గాంధారి మండల కేంద్రంలో రెండేళ్లుగా విధులు నిర్వహిస్తూ సౌమ్యుడిగా పేరు తెచ్చుకున్నారు. కానిస్టేబుల్ మృతిపై ఎస్సై మహేందర్, ఎస్సై ఆంజనేయులు, సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.